క్లుప్తంగా

30 నుంచి 'ఆరోగ్య సురక్ష' శిబిరాలు

పెనమలూరు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఈ నెల 30వ తేదీన చోడవరం, అక్టోబర్ 3వ తేదీన గంగూరు–1 సచివాలయం, 5న వణుకూరు–1 సచివాలయం, 6న పెనమలూరు–2 కమ్యూనిటీహాల్, 7న గోసాల–1 సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 10న పెనమలూరు–3 కమ్యూనిటీ హాల్‌లో, 11న గంగూరు–2 సచివాలయంలో, 12న పెదపులిపాక సచివాలయంలో, 16న వణుకూరు–2 సచివాలయంలో, 17 గోసాల–2లో వైద్య శిబిరాలు ఉంటాయన్నారు. వైద్యులు ఈ శిబిరాల్లో అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో బుధవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివారిని అలంకరించి పల్లకీలో ఊరేగించారు. శివసాధంలో స్వామివార్లకు కల్యాణం చేశారు. ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా ఆలయంలో చండీహోమం కూడా చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

విధుల్లో చేరిన పెనమలూరు సీఐ రామారావు



పెనమలూరు: పెనమలూరు సీఐగా టీవీవీ రామారావు బుధవారం విధుల్లో చేరారు. పెనమలూరులో సీఐగా పని చేసిన ఎం.కిషోర్‌బాబు యనమలకుదురులో ఇటీవల జరిగిన హత్య కేసులో నిర్లక్ష్యం చూపారనే ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ సీఐగా కంకిపాడు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు గత కొద్ది రోజులుగా పెనమలూరులో విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఇప్పుడు రామారావును సీఐగా నియమించారు. రామారావు 2009 సంవత్సరంలో సరీస్‌లో చేరారు. ఆయన ఎస్‌ఐగా ఇబ్రహీంపట్నం, మాచవరం, విజయవాడ సీసీఎస్, ఉయ్యూరు రూరల్, వన్‌టౌన్, ఇంటెలిజెన్స్‌లో పని చేశారు. రామారావుకు సీఐగా పదోన్నతి వచ్చిన తర్వాత పెనమలూరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

దాతల సాయం అభినందనీయం



కంకిపాడు: దాతల సాయం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని మంతెన జెడ్పీ పాఠశాలలో విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ పాఠశాల పూర్వ విద్యార్థి కొండవీటి వెంకట సురేష్ 1,650 నోటు పుస్తకాలను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. పుస్తకాలతో పాటుగా జామెంట్రీ, విద్యాసామగ్రి కిట్లను అందజేశారు. గ్రామస్తులు నెక్కలపూడి బాల ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడ్డ వెంకట సురేష్ ఏటా విద్యార్థుల కోసం సాయం అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి వెంకట రమణ, దాత తండ్రి కొండవీటి వెంకటేశ్వరరావు, స్థానికులు తాతా వెంకటేశ్వరరావు, వీరంకి దుర్గా నాగేశ్వరరావు, హెచ్‌ఎం రత్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారం తయారీపై మహిళలకు అవగాహన



గన్నవరం రూరల్: ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవటం ద్వారా పోషకాహారం శరీరానికి లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి చెప్పారు. బుధవారం మండలంలోని ముదిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారు చేసే విధానం వివరించి తయారు చేసి ప్రదర్శించారు. మహిళలు, చిన్నారులు, గర్భిణులలో రక్తహీనత నివారణకు పోషకాహారం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.ప్రమోద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్.. ఆనందం పెంచెన్

కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేత

పెనమలూరు: రాష్ట్రంలో పేద ప్రజలకు అండగా సీఎం వైఎస్ జగన్ ఉన్నారని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమ పథకాలు అమలు జరిగి తీరుతాయని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. పెనమలూరు మండలంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 287 పింఛన్లను పద్మావతి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో పింఛన్లు మంజూరు చేసేవారు కాదన్నారు. పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరిగేవారని తెలిపారు. టీడీపీ పాలనలో పింఛన్‌లు తీసుకునే వారిలో ఎవరైనా మృతి చెందితేనే మరొకరికి పింఛన్ కేటాయించి ఇచ్చేవారని అన్నారు. అయితే జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసిన వెంటనే పింఛన్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. గతంలో పింఛన్ సొమ్ము కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి ఎదురు చూసే పరిస్థితి ఉండేదని తెలిపారు. జగనన్న పాలనలో నేడు ప్రతి నెల 1వ తేదీన వలంటీర్లు ఠంచన్‌గా పింఛన్లు ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు గ్రామాల్లో లేక పోయినా వలంటీర్‌లు లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేస్తున్నారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన నేడు జగనన్న పాలనను ప్రజలు గమనించాలని కోరారు. జగనన్నకు అండగా ఉంటేనే భవిష్యత్తులో సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, సర్పంచ్‌లు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, నేతలు అక్బర్‌పాషా, పోలవరపు రవి, చక్కగోపీకృష్ణ, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివారావు, ఏఎంఈ డైరెక్టర్లు కొడాలి సుష్మా, చిట్టూరి సుబ్బారావు, ఈవోలు పద్మావతిదేవి, ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.



పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



నున్నలో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పారదర్శకంగా సంక్షేమ పథకాలు..

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మాజీ ఎంపీపీ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమం గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ అధ్యక్షతన బుధవారం నున్న గ్రామ పంచాయతీ వద్ద జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాగిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల అర్హులైన వారికి పింఛన్లు అందకపోతే వారికి కూడా వచ్చే విధంగా చేస్తామన్నారు. గ్రామంలో కొత్తగా 122 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందని సర్పంచి కాటూరి సరళశ్రీనివాస్ అన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో బుధవారం కొత్తగా మంజూరైన 114 పింఛన్లను లబ్ధిదారులకు జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జగనన్న ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా అభిమానాన్ని చూరగొంటుందన్నారు. ఎవరైనా అర్హులు మిగిలినట్లయితే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దూరు రత్నం, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో 48 మందికి కొత్త పింఛన్లు..

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామ సచివాలయంలో కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. మొత్తం 48 మంది కొత్త లబ్ధిదారులకు రూ. 1,30,750 నగదును గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. గ్రామంలో అత్యధికంగా 48 పింఛన్లు మందికి కొత్త పింఛన్లు మంజూరుకావడంతో పాటు నగదు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. వార్డు సభ్యులు మూల్పూరు మాధవన్, దుర్గాప్రసాద్, నాగమణి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు..

గన్నవరం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌లు అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని మాదలవారిగూడెం సర్పంచ్ బుద్ధాల లక్ష్మీ ప్రసన్న కోరారు. బుధవారం స్థానిక సచివాలయం వద్ద గ్రామంలో కొత్తగా మంజూరైన 19 పింఛన్లను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. మారుమూల గ్రామాల్లో సైతం అర్హులు అన్ని పథకాలు పొందటం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు. సచివాలయం కార్యదర్శి కేవీ రాజశేఖర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లు అందిస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు



మాదలవారిగూడెంలో పెన్షన్‌లు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న



కేసరపల్లిలో కొత్త పింఛను పంపిణీ చేస్తున్న సర్పంచి లక్ష్మీ మౌనిక

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కంకిపాడు: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో పారదర్శకతకు పాతరేసి, అర్హతలను అటకెక్కించి పాలన సాగించారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే కొలమానంగా పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ మండలంలో తొలి విడతలో 204, మలి విడతలో 304 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పెరిగిన కొత్త పింఛన్లు సెప్టెంబరు నుంచి అమలులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కంకిపాడులో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు, ఇతర నేతలు

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం

విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అదితి సింగ్

రామవరప్పాడు: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలో బుధవారం జగనన్నకు చెబుదాం మండల స్థాయి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పరిష్కారం కోసం అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 22 అర్జీలను ప్రజలు అధికారులకు అందజేశారు. వీటిని ఆయా శాఖలకు ఆన్‌లైన్ చేసి వెంటనే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. టీడీపీ ప్రభుత్వంలో రామవరప్పాడు రింగ్ సమీపంలో ఫ్లై ఓవర్ నిమిత్తం తొలగించిన షాపుల బాధితులకు న్యాయం చేయాలని ప్రసాదంపాడు ఎంపీటీసీ దూరు రత్నం సబ్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అదితి సింగ్ సందర్శించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జె. సునీత, తహసీల్దార్ జాహ్నవి, ఇన్‌చార్జి ఎంపీడీవో శేషగిరిరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, సర్పంచ్ కొలుసు సముద్రవేణి, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మండల స్థాయి క్రీడా సమాఖ్య పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జాస్తి, గౌసాని



మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో రామ్ బాలసింగ్

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరగనున్న క్రీడా సమాఖ్య ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను రోటరీ క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌసాని, సర్పంచి నిడమర్తి సౌజన్య ప్రారంభించారు. అనంతరం బాలుర విభాగంలో మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మండల వ్యాప్తంగా 250 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరికి భోజన వసతి కూడా కల్పించారు. ఎంఈఓ–2 కమల, పాఠశాల హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, మల్లికార్జున హైస్కూల్ కరస్పాండెంట్ నక్కిన చినవెంకట్రాయుడు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి ఆటలపోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారం ఉత్సాహభరితంగా సాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన దాదాపు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారి రామ్ బాలసింగ్ ఆటల పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. వీరవల్లి, బాపులపాడు జెడ్పీ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు పి.నిర్మల, తోట వెంకట నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లా అనిత, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు నివాళులు

పెనమలూరు: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నేతలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన నివాళి అర్పించారు. పెనమలూరు మాజీ సర్పంచి మరీదు మస్తాన్‌రావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పెనమలూరు నియోజకవర్గ మాజీ కన్వీనర్ పటమట సురేష్‌బాబు అంజలి ఘటించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, తాతినేని కోటేశ్వరరావు పలువురు పాల్గొన్నారు. పోరంకిలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నేత వీర్ల వెంకటేశ్వరరావు అంతిమ యాత్రలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పెనమలూరులో మరీదు మస్తాన్‌రావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఏపీపీటీడీకి ప్రభుత్వ గుర్తింపుపై హర్షాతిరేకాలు

గన్నవరం: ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం పట్ల ఆ సంఘ నేతలు బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘ నేతలు బస్టాండ్ ఆవరణలో మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన గేట్ మీటింగ్‌లో ఏపీపీటీడీ డిపో కార్యదర్శి టీవీకే రావు మాట్లాడుతూ ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు ఇచ్చినందుకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గుర్తింపునకు కృషి చేసిన ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీపీటీడీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిచెట్టి దామోదర్, జీవీ నరసయ్యకు ధన్యవాదాలు చెప్పారు. యూనియన్ డిపో అధ్యక్షుడు డీవీవీ నారాయణ, గౌరవాధ్యక్షుడు వి. ప్రసాద్, సంయుక్త కార్యదర్శి కేబీఎం రావు, కోశాధికారి టీకే రావు తదితరులు పాల్గొన్నారు.



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న సంఘ నేతలు

విద్యార్థుల ఎఫ్‌సీఐ సందర్శన

హనుమాన్‌జంక్షన్ రూరల్: భారత ఆహార సంస్థపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు క్షేత్ర పర్యటనలో భాగంగా హనుమాన్‌జంక్షన్ ఎఫ్‌సీఐ డిపోను బుధవారం సందర్శించారు. బియ్యం సేకరణలో భారత ఆహార సంస్థ ప్రాముఖ్యత, విధివిధానాలు, నాణ్యమైన బియ్యం సేకరించేందుకు అనుసరించే పద్ధతులు, నాణ్యతను పరీక్షించే యంత్రాలు, వాటి పనితీరు విధానం, బియ్యం నిల్వ ఉంచేందుకు తీసుకునే జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఎఫ్‌సీఐ అధికారులు కోట్యా నాయక్, రూప్లా నాయక్, హేమ మాధురి, జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. నిడమానూరు నెహ్రూనగర్‌లో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. రంగారావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20లక్షలు, పంచాయతీ నిధులు మరో రూ. 7.50 లక్షలతో నెహ్రూనగర్‌లో ఐదు అడ్డ రోడ్డులు, నాలుగు సీసీ డ్రెయిన్లను అభివృద్ధి పరుస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో రహదారులు అభివృద్ధి జరగకపోవడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

రోడ్డు విస్తరణ ప్రాంతం పరిశీలన



కంకిపాడు: జాతీయ రహదారి విస్తరణ ప్రాంతాన్ని వివిధ శాఖల అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. కంకిపాడు ఎస్‌ఐ కె.సుధాకర్, జాతీయ రహదారుల శాఖ అధికారి, రవాణాశాఖ ఉయ్యూరు మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన బృందం విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి మార్గంలో విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్న కొణతనపాడు అడ్డరోడ్డు ప్రాంతాన్ని సందర్శించారు. కొణతనపాడు రోడ్డు నుంచి ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వరకూ విస్తరణ పనులు పెండింగ్‌లో ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ప్రజాప్రతినిధుల సూచనలు, ఆయా శాఖల సూచనలతో రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సిన తీరుతెన్నులను పరిశీలించేందుకు అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. రోడ్డు విస్తరణ జరిగే తీరు, ట్రాఫిక్ మళ్లింపు, ఇతరత్రా అంశాలపై సమీక్ష జరిపారు.

27న అరుణాచలం, కంచికి బస్ సర్వీస్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈ నెల 27వ తేదీన అరుణాచలం, కంచికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌ను నడపనున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు 27న సాయంత్రం 6 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి 28న శ్రీకాళహస్తి ఆలయం, కాణిపాకం విఘ్నేశ్వర స్వామి, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుందన్నారు. 29వ తేదీన అరుణాచలం గిరిప్రదక్షిణ, స్వామివారి దర్శనం, కంచి కామాక్షి అమ్మవారి దర్శనం అనంతరం తిరిగి బయలుదేరి 30వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్ర టికెట్ ధరను రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సర్వీస్‌ను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 8790996090, 7382905633లలో సంప్రదించాలని కోరారు.

రేకుల షాపులే టార్గెట్!

- నాలుగు రోజుల్లో ఆరు చోరీలు
- పెనమలూరు, పోరంకిల్లోని చిరు వ్యాపారుల్లో ఆందోళన

పెనమలూరు: పోరంకి ప్రాంతంలో నాలుగు రోజులుగా వరుస దొంగతనాలు జరగటంతో పోలీసులు బుధవారం పలు కేసులు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి పరిధి పెనమలూరు సెంటర్ వద్ద కొర్రపాటి సురేష్ శ్రీనివాస రైస్ స్టోర్ నడుపుతున్నాడు. అతని షాపులో ఈ నెల తొమ్మిదో తేదీన గుర్తు తెలియని దొంగలు ఇనుప రేకులు కట్ చేసి షాపులో రూ. 12 వేలు చోరీ చేశారు. అదే రోజున పక్కనే ఉన్న సెల్ షాపు రేకులు కట్ చేసి షాపులో రూ. 6 వేలు, పక్కనే ఉన్న షూ షాపు రేకులు కట్ చేసి షాపులో రూ. 4 వేలు చోరీ చేశారు. అలాగే ఈనెల ఆరో తేదీ రాత్రి పోరంకి నిడమానూరు రోడ్డులో ఉన్న సంఘం పాల షాపు రేకులు కట్ చేసి రూ. 10 వేలతో పాటు సీసీ కెమెరాలు, పరికరాలు చోరీ చేశారు. అదే రోజున పోరంకి సెంటర్‌లో శ్రావణి కూల్ డ్రింక్ షాపులో రూ. 9 వేలు, ఎన్టీఆర్ బొమ్మ వద్ద ఉన్న విజయ డెయిరీ షాపులో రూ. 9 వేలు దొంగలు చోరీ చేశారు. అదే విధంగా పప్పుల మిల్లు సెంటర్ వద్ద భవానీ టెండర్స్‌లో పై రేకులు కట్ చేసి షాపులో ఉన్న రూ. 8 వేలు చోరీ చేశారు. హ్యాపీ బార్‌లో కూడాపై రేకులు కట్ చేసి రూ. 12 వేలు, 30 మద్యం సీసాలు చోరీ చేశారు. ఆయా షాపుల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగల ముఠా సంచరిస్తూ రేకులతో ఉన్న షాపులను టార్గెట్ చేసిపై రేకులు కట్ చేసి చోరీలకు పాల్పడుతున్నారని.. షాపుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గణపతినగర్‌కు చెందిన చెందిన వీరంకి నాగమౌనిక గత 2013లో పెనమలూరు హైస్కూల్ సెంటర్‌కు చెందిన వీరంకి శ్రీనివాసరావును కట్నకానుకలు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త వీరంకి ఈశ్వరమ్మ, మామ సత్యనారాయణ, ఆడపడుచు చిమటా పార్వతీ, ఆమె భర్త చిమటా వెంకట శ్రీనివాసరావులు అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.